క్లుప్తంగా

భూ సమస్యలు పరిష్కరించండి



మాట్లాడుతున్న తహసీల్దారు ధర్మరాజు

వంగర: రైతుల భూ సమస్యలు పరిష్కరించాలని తహసీల్దారు దిరిశాల ధర్మరాజు సూచించారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో రెవెన్యూ సిబ్బందితో మంగళవారం సమావేశమైన ఆయన.. గ్రామసభల్లో రీసర్వేపై రైతులు చేసిన ఫిర్యాదులను ఏ మేర పరిష్కరించారన్న అంశంపై సమీక్షించారు. తక్షణమే రైతులు ఫిర్యాదుల్లో తెలియజేసిన సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఈ నెల 5వ తేదీ నుంచి జరగనున్న రెవెన్యూ సదస్సులకు సమాయత్తం కావాలని తెలిపారు. కార్యక్రమంలో రీసర్వే డీటీ ఆర్.గంగాభవాని, వీఆర్‌వోలు, తదితరులు పాల్గొన్నారు.

యూనిఫాం అందజేత



విద్యార్థులకు దుస్తులు అందిస్తున్న దాతలు

రాజాం: మండలంలోని మొగిలివలస ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు యూనిఫాం(ఏకరూప దుస్తులు) మంగళవారం అందజేశారు. గ్రామానికి చెందిన కెల్ల సూర్యనారాయణ, లెంక గణనాథ, శాసపు వెంకటరమణ, ఆబోతుల హరి, అవురు గణనాథ్, శాసపు రమణమూర్తిలు రూ.20 వేలతో మొత్తం 33 మంది విద్యార్థులకు వీటిని సమకూర్చారని ప్రధానోపాధ్యాయుడు ఎం.శ్రీరాములు తెలిపారు. పాఠశాల అభివృద్ధికి పాటుపడుతున్న దాతలను సిబ్బంది అభినందించారు. కార్యక్రమంలో ఎస్‌ఎంసీ చైర్మన్ రమణమ్మ, రమేష్, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీల పెంపు తగదు



ఆందోళన చేస్తున్న మహిళలు, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు శంకరరావు

బొబ్బిలి: విద్యుత్ చార్జీల పెంపు తగదని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు పొట్నూరు శంకరరావు అన్నారు. విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ స్థానిక పట్టణంలోని సింగారపు వీధిలో మహిళలతో కలిసి ఆయన మంగళవారం ఆందోళన చేపట్టారు. తాము అధికారంలోకి వస్తే అస్సలు విద్యుత్ చార్జీలు పెంచబోమని చెప్పి, ఇప్పుడు చార్జీలు పెంచడం దారుణమన్నారు. స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయవద్దని, ట్రూఅప్ చార్జీలు రద్దు చేయాలని కోరారు.

ఆలయాభివృద్ధికి విరాళం



నగదు అందజేస్తున్న దాతలు

వంగర: మండలంలోని గీతనాపల్లిలో ఉన్న శ్రీఎండల మల్లిఖార్జునస్వామి ఆలయ అభివృద్ధికి కొప్పర గ్రామ యువకులు, ఉద్యోగులు రూ.25 వేల విరాళం మంగళవారం అందజేశారు. ప్రజలంతా ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రత్యేకాభిషేకాలు చేయాలని వారు ఆలయ అర్చకుడిని కోరారు. సర్పంచ్ నెయిగాపుల శివరామకృష్ణయ్య, ఆలయ అర్చకుడు శరంతి మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

ఘనంగా చర్చి పండగ



దైవ సందేశం చదివి వినిపిస్తున్న ఫాదర్ జాన్‌ప్రకాష్

తెర్లాం: స్థానిక పునీత ఫ్రాన్సిస్ శౌరి వారి దేవాలయం(ఆర్‌సీఎం చర్చి) పండగ మంగళవారం ఘనంగా నిర్వహించారు. విచారణ గురువు ఫాదర్ సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన దివ్యబలి పూజా కార్యక్రమంలో విశాఖపట్నం మేత్రాసనం నుంచి ఫాదర్ జాన్‌ప్రకాష్ పాల్గొని, ఏసుప్రభువు సందేశం వినిపించి, ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ప్రతి ఒక్కరూ దేవుని యందు విశ్వాసం ఉంచాలని, రోజూ ప్రార్థన చేసుకోవాలని విశ్వాసులకు తెలిపారు. తెర్లాం ఆర్‌సీఎం చర్చి విచారణ అయిన తర్వాత తొలిసారి చర్చి పండగ చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో భాగంగా చిన్నారులు ప్రదర్శించిన నృత్యాలు చూపరులను ఆకట్టుకున్నాయి.

క్షయ వ్యాధి నివారణకు చర్యలు

వంగర: గ్రామాల్లో క్షయ వ్యాధి నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు వైద్యాధికారి సుష్మిత దయానా తెలిపారు. స్థానిక పీహెచ్‌సీలో ఆరోగ్య సిబ్బందితో మంగళవారం సమావేశమైన ఆమె.. ఈ నెల 7వ తేదీన క్షయ వ్యాధి నివారణకు వంద రోజుల ప్రోగ్రాంను ప్రారంభించనున్నామని, మండలంలోని ఆశ కార్యకర్తలు మినహా మిగిలిన ఆరోగ్య సిబ్బంది అంతా విజయనగరానికి రావాలన్నారు.

చలికాలం.. జరభద్రం!



- చలికాలంలో వ్యాధులు ప్రబలే అవకాశం
- చిన్నపిల్లలపై చలి ప్రభావం అధికం
- జాగ్రత్తలు పాటించకుంటే ముప్పు తప్పదు
- మంచులో తిరగొద్దని వైద్యుల సూచన

రాజాం సిటీ: రోజురోజుకూ చలి పెరుగుతోంది. ఈ చలికాలంలో చలి తీవ్రతతో పాటు వ్యాధులు సైతం విజృంభిస్తాయి. జాగ్రత్తలు పాటించకుంటే ప్రాణాలకే ముప్పు తెస్తాయి. ఈ కాలంలో ఎక్కువగా ఉబ్బసం, ఆయాసం, గుండె జబ్బులు ఉన్న వారు ఇబ్బందులు పడతారు. ఉదయం జాగింగ్, వాకింగ్‌కు వెళ్లాలంటే చర్మం పొడిబారి బిగుసుగా మారే అవకాశం ఉంది. కాళ్ల మడమలు, పెదవులు పగలడం వంటి సమస్యలు వస్తాయి. ముఖ్యంగా చిన్నపిల్లలపై చలి ప్రభావం అధికంగా ఉంటుంది. వివిధ రుగ్మతలున్న వారు తగిన జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని, అలాంటప్పుడే మనల్ని మనం రక్షించుకోవచ్చని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

ఉన్ని దుస్తులు..

చలికాలంలో రాత్రివేళ తమ పనులు ముగించుకుని, ఇంటికి వెళ్లేవారు, పనులు నిమిత్తం బయటకు వచ్చేవారంతా ఉన్ని దుస్తులు ధరించాలి. బ్రాండెడ్ దుస్తులు అయితే ఇంకా మంచిది. బైక్‌పై వెళ్లే వారు మంకీ క్యాప్, చేతులకు గ్లౌజ్‌లు, షూ ధరించాలి.

మాయిశ్చరైజర్లు వాడాలి..

చలికాలంలో శరీరానికి మాయిశ్చరైజర్లు తప్పనిసరి. క్రీమ్ బేస్డ్ మాయిశ్చరైజర్లు ఉపయోగించడం చాలా మంచిది. ముఖం, చేతులు, కాళ్లకు రాసుకుంటే చర్మం మృదువుగా తయారవుతుంది. ఎన్నోరకాల మాయిశ్చరైజర్లు ప్రస్తుతం అందుబాటులో ఉన్నాయి. రోజూ పడుకునే ముందు, ఉదయం నిద్రలేవగానే మాయిశ్చరైజర్లు రాసుకోవాలి. చలికాలంలో వేధించే మరో సమస్య.. పెదాలు పగిలి రక్తం కారడం అది జరగకుండా ఉండాలంటే పెదాలకు వేజిలిన్, వెన్న వంటివి రాసుకోవాలి.

చిన్నారుల పట్ల జాగ్రత్త..



చలికాలంలో చిన్నారులకు జబ్బులు రాకుండా జాగ్రత్త వహించాలి. చలి నుంచి రక్షణకు వారికి స్వెటర్లు తొడగాలి. వేడినీటితోనే స్నానం చేయించాలి. ప్రయాణాలు తగ్గించుకోవడం వీలైనంత వరకు మంచిది. ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి. పిల్లలకు ఇచ్చే ఆహారంలో ఆకుకూరలు ఎక్కువగా ఉండేలా చూసుకోవాలి.

– ఎం.కోటేశ్వరరావు, చిన్నపిల్లల వైద్యుడు, ప్రాంతీయ ఆస్పత్రి, రాజాం

పాదాలు పగిలితే..

చలికాలంలో పాదాలు పగలడం ఎక్కువగా ఉంటుంది. ఉప్పు కలిపిన గోరువెచ్చటి నీటిలో పాదాలను పది నిమిషాల పాటు ఉంచాలి. నీటిలో ఉంచిన తర్వాత సబ్బుతో శుభ్రంగా కడుక్కొని, పొడిగుడ్డతో తుడుచుకోవాలి. పగిలిన చోట మాయిశ్చరైజ్ క్రీమ్ రాయాలి. మధుమేహ వ్యాధిగ్రస్తులంతా వైద్యుల సహాలు పాటించాలి.



చలికాలంలో ఇలాంటి దుస్తులతో కాస్త ఉపశమనం..

తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

- చలిగాలులు వీస్తున్న సమయంలో ఇంటి తలుపులు, కిటికీలు మూసి ఉంచాలి.
- శరీరానికి వేడిని కలిగించే ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవాలి.
- నియంత్రించ లేని వణుకు ఉంటే ముందే గుర్తించి చికిత్స తీసుకోవాలి.
- ఆల్కహాలిక్, పానీయాలను స్వీకరించరాదు. దానివల్ల శరీరం డీహైడ్రేషన్‌కు గురయ్యే అవకాశం ఉంటుంది.
- పొలం పనులకు వెళ్లేవారికి చలి వల్ల కాళ్లు, చేతులకు దురదలు వస్తుంటాయి. అవి వస్తే వేజిలిన్, చర్మ క్రీములు రాసుకోవడం మంచిది.
- మందంగా ఉండే దుస్తుల కన్నా పలుచగా ఉన్న దుస్తులు ధరిస్తే మంచిది.
- శరీర ఉష్ణోగ్రత తగ్గకుండా పొడి దుస్తులను ధరించాలి.
- చల్లగాలి ఊపిరితిత్తులకు చేరకుండా నోరుమూసి ఉంచాలి.
- వేడిపాలు, ఆహారం తీసుకోవాలి.
- చిన్నపిల్లలు, వృద్ధులను చలికి బయటకు వెళ్లకుండా చూడాలి.
- చలి తీవ్రతతో జలుబు బాగా చేస్తే ఊపిరి తీసుకునే అవకాశం ఉండదు.
- హృద్రోగులు అధికంగా పనిచేయరాదు.
- సూర్యోదయం తర్వాత జాగింగ్, వ్యాయామం చేయడం మంచిది.
- చలికి పాదాలు పగిలితే గోరువెచ్చని ఉప్పు నీటిలో 5, 10 నిమిషాల పాటు పాదాలు ఉంచాలి.
- పాదాల పగుళ్లకు పసుపు, నిమ్మరసం వంటివి రాయకూడదు.

గ్లిజరిన్ సబ్బులు..

చలికాలంలో చర్మం తెల్లగా పొడిబారకుండా ఉండడానికి గ్లిజరిన్ సబ్బులు వాడాలి. స్నానం సబ్బు కూడా ఆయిల్ బేస్డ్‌తో ఉన్నవి మంచిది. అప్పుడే చర్మం మృదువుగా ఉంటుంది. స్నానానికి ముందు ఆలివ్ ఆయిల్, కొబ్బరినూనెతో మసాజ్ చేసుకుని తలస్నానం చేయాలి. వేడినీటితో స్నానం చేస్తే చర్మం పొడిబారుతుంది. గోరువెచ్చని నీటితోనే స్నానం చేయాలి. ఎక్కువ సేపు స్నానం చేస్తే చర్మంపై ఉండే కణాలు కూడా దెబ్బతింటాయి.

అప్రమత్తంగా ఉండాలి..



చలికాలంలో ఆస్తమా ఉన్న వారు నిత్యం వాడే మందులను సిద్ధంగా ఉంచుకోవాలి. దుమ్ము,ధూళి పనులకు దూరంగా ఉండాలి. చల్లని గాలిలో తిరగరాదు. శ్వాసనాళాలు, మూసుకుపోకుండా వైద్యుడి సలహా మేరకు మందులు వాడాలి. ఇన్‌హేలర్, నెబులైజర్ వంటివి అందుబాటులో ఉంచుకోవాలి. చలిలో ఎక్కువగా తిరిగితే రక్తనాళాలు సంకోచించి, గుండె సంబంధిత సమస్యలు వస్తాయి.

– కె.హరిబాబు, సూపరింటెండెంట్, ప్రాంతీయ ఆస్పత్రి, రాజాం

బస్సు సర్వీసు పునరుద్ధరించాలి



వంతరాం–విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్ బస్సు సర్వీసును పునరుద్ధరించాలని తెర్లాం మండలంలోని లోచర్లకు చెందిన మాజీ ఎంపీటీసీ సభ్యుడు యుగంధర్ విజ్ఞప్తి చేశారు. ఇదే విషయమై ఆయన గ్రామస్తులతో కలిసి పార్వతీపురం ఆర్టీసీ డిపోకు మంగళవారం వెళ్లి, అక్కడి డీపీటీవో(డిస్ట్రిక్ట్ పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్)కు ఎమ్మెల్యే ఆర్‌వీఎస్‌కేకే రంగారావు(బేబీనాయన) ఇచ్చిన సిఫార్సు లేఖను అందజేశారు. గతంలో ఈ బస్సు సర్వీసు ఉండడం ద్వారా విశాఖపట్నం వెళ్లేందుకు పలు గ్రామాల ప్రజలకు అవకాశం ఉండేదని, అయితే ఆ తర్వాత కొన్నాళ్లకు అదే బస్సును నిలిపివేశారని గుర్తు చేశారు. ప్రజల సౌకర్యార్థం బస్సు సర్వీసును తిరిగి ప్రారంభించాలని అభ్యర్థించారు. – తెర్లాం

డ్రగ్స్ రహిత సమాజం నిర్మిద్దాం



డ్రగ్స్ రహిత సమాజం నిర్మిద్దామని పిలుపునిస్తూ బొబ్బిలి మండలంలోని కోమటిపల్లిలో ఉన్న స్వామి వివేకానంద పాలిటెక్నిక్ కళాశాలలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. యువత, విద్యార్థులంతా మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, క్రమశిక్షణతో మెలగి, ఉన్నత స్థాయికి చేరుకోవాలని బొబ్బిలి డీఎస్పీ పి.శ్రీనివాసరావు ఆకాంక్షించారు. మద్యం, గంజాయి, కొకైన్, హెరాయిన్, ఖైనీ, గుట్కా వంటి బారినపడి ఎంతోమంది తమ జీవితాలు నాశనం చేసుకుంటున్నారన్నారు. ఎవరైనా డ్రగ్స్‌కు అలవాటు పడితే కళాశాలలో ఏర్పాటు చేసిన డ్రాప్‌బాక్స్ ద్వారా తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐ సతీష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు. – బొబ్బిలి రూరల్

ప్రతిభకు వైకల్యం అడ్డు కాదు



వంగర: క్రీడాపోటీల్లో విజేతలైన దివ్యాంగులకు బహుమతులు అందజేస్తున్న ఎంఈవో దుర్గారావు



రేగిడి: దివ్యాంగ చిన్నారులకు వాటర్ బాటిళ్లు అందిస్తున్న వైస్ ఎంపీపీలు అచ్చెన్నాయుడు, జగన్మోహనరావు



రాజాం సిటీ: దివ్యాంగుల దినోత్సవంలో మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాసరావు



బొబ్బిలి రూరల్: దివ్యాంగులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎంఈవో వాసు



తెర్లాంలో విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎంపీపీ ఉమాలక్ష్మి



సంతకవిటి: దివ్యాంగ విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న దృశ్యం



బొబ్బిలి సీహెచ్‌సీలో నిర్వహించిన దివ్యాంగుల దినోత్సవంలో వైద్య సిబ్బంది



బాడంగి: దివ్యాంగులకు కల్పిస్తున్న సదుపాయాలు వివరిస్తున్న ఎంఈవో లక్ష్మణదొర



రామభద్రపురం: చిన్నారులకు బహుమతులు అందజేస్తున్న ఎంఈవోలు తిరుమలప్రసాద్, పెంటయ్య

అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం.. అన్ని మండల కేంద్రాల్లోని భవిత కేంద్రాల్లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక రంగాల్లో దివ్యాంగులను ప్రోత్సహించడమే లక్ష్యంగా ఏటా ఈ దినోత్సవం జరుపుకోగా, ప్రజాప్రతినిధులు, అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొని, దివ్యాంగుల సంక్షేమానికి అమలు చేస్తున్న పథకాలు, కార్యక్రమాలను వివరించారు. ప్రతిభకు వైకల్యం అడ్డు కాదన్న స్ఫూర్తిని దివ్యాంగుల్లో నింపాలని తెలిపారు. ప్రతీ దివ్యాంగునిలో ఏదో ఒక ప్రతిభ ఉంటుందని, దానిని ప్రోత్సహిస్తే వారు ఉన్నత శిఖరాలు అధిరోహించగలరన్నారు. అనంతరం పలు క్రీడాపోటీల్లో విజేతలుగా నిలిచిన దివ్యాంగులకు బహుమతులు అందజేశారు.

– బొబ్బిలి, రాజాం నెట్‌వర్క్

కనీస వేతనం అమలు చేయాలి



కనీస వేతనం అమలు చేయాలని ఆశ కార్యకర్తలు డిమాండ్ చేస్తున్నారు. ఇదే విషయమై వారు బొబ్బిలి మండలంలోని పక్కి, పిరిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వద్ద మంగళవారం ఆందోళనకు దిగారు. సీఐటీయూ నాయకుడు పి.శంకరరావుతో కలిసి విలేకరులతో మాట్లాడిన వారు.. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తోందని మండిపడ్డారు. 44 కార్మిక చట్టాలను కేవలం 4 లేబర్ కోడ్స్‌గా మలిచి, శ్రమజీవుల హక్కులను హరిస్తోందని ధ్వజమెత్తారు. రానున్న బడ్జెట్ సమావేశంలో ఆశ కార్యకర్తల వేతనాలు పెంచేలా బిల్లు తేవాలని, లేకపోతే దేశ వ్యాప్తంగా సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. – బొబ్బిలి రూరల్

సంక్షిప్తంగా..

'పొలం పిలుస్తోంది'

బొబ్బిలిరూరల్: మండలంలోని రంగరాయపురం, పెంట గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ ఏడీ మజ్జి శ్యామసుందర్.. ఇటీవల కురిసిన వర్షానికి తడిచిన వరి పనలను ఏ విధంగా రక్షించుకోవాలో వివరించారు. తడిచిన వరి పనల నుంచి మొలకలు రాకుండా వాటిపై ఉప్పు ద్రావణం చల్లాలని తెలిపారు. అనంతరం అపరాల పంటల సాగుపై అవగాహన కల్పించారు.

తెర్లాం: మండలంలోని పలు గ్రామాల్లో ఇటీవల తుపాను వర్షాలకు జరిగిన పంట నష్టాన్ని వీఏఏ(విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్)లు క్షేత్ర స్థాయికి వెళ్లి, మంగళవారం పరిశీలించారు. వర్షానికి తడిచిన పంటను ఏ విధంగా రక్షించుకోవాలో రైతులకు సూచనలు, సలహాలు ఇచ్చారు.

మహాసభను విజయవంతం చేయండి

రాజాం సిటీ: విజయవాడలో ఈ నెల 10వ తేదీన సీపీఎస్ ఉద్యోగులు చేపట్టనున్న మహాసభను విజయవంతం చేయాలని ఏపీసీపీఎస్‌ఈఏ జిల్లా ప్రధాన కార్యదర్శి మొయ్యి శ్రీరాములు పిలుపునిచ్చారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో మహాసభకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు సీపీఎస్ రద్దు చేసి, ఓపీఎస్ కచ్చితంగా అమలు చేయాలనే డిమాండ్‌తో సభ నిర్వహించనున్నామన్నారు. ఈ సభకు అన్ని శాఖల్లోని సీపీఎస్ ఉద్యోగులంతా అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో చంద్రినాయుడు, వాసు తదితరులు పాల్గొన్నారు.

పొదుపు సంఘాలను బలోపేతం చేయాలి

బొబ్బిలి: పొదుపు సంఘాలను బలోపేతం చేయాలని, ఆ దిశగా చర్యలు తీసుకోవాలని మెప్మా పీడీ చిట్టిరాజు సూచించారు. స్థానిక మెప్మా కార్యాలయంలో పలు పొదుపు సంఘాలకు మంజూరైన రూ.15 లక్షల చెక్కును ఆయన మంగళవారం అందజేశారు. బ్యాంకు లింకేజీ రుణాలను సద్వినియోగం చేసుకుని, మహిళా సంఘాలు ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం రుణాలపై సమీక్షించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ తప్పనిసరి



వాహనదారులకు సూచనలిస్తున్న ఎస్‌ఐ నీలావతి

రేగిడి: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్‌ఐ పి.నీలావతి సూచించారు. మండలంలోని చిన్నశిర్లాం, బూరాడ జంక్షన్‌ల వద్ద వాహన తనిఖీలు మంగళవారం నిర్వహించారు. అటువైపుగా వచ్చే వాహనదారులను పోలీసులు ఆపి, వారి వాహన ధ్రువపత్రాలను పరిశీలించారు. హెల్మెట్ ధరించని, వాహన సంబంధిత ధ్రువపత్రాలు లేని వారికి అపరాధ రుసుం విధించారు. ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించి, రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలని ఎస్‌ఐ కోరారు.

గడువులోగా సర్వే పూర్తి చేయాలి

బాడంగి: గడువులోగా ఎంఎస్‌ఎం(మిడిల్, స్మాల్, మైక్రో) సర్వేను పూర్తి చేయాలని ఎంపీడీవో ఎస్.రామకృష్ణ సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని ముగడ, బాడంగి, భీమవరం ప్రాంతాల్లో చేపడుతున్న సర్వేను ఆయన మంగళవారం పరిశీలించి, పలు సూచనలు చేశారు. డేటాబేస్ అభివృద్ధి చేయడం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలపై అవగాహన కల్పించడం, మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడం, వ్యాపారాభివృద్ధి వంటి అంశాలే లక్ష్యంగా ఈ సర్వే జరుగుతోందని, సర్వేకు అందరూ సహకరించాలని ఆయన కోరారు. ఆయన వెంట ఈవోపీఆర్‌డీ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బెల్టుషాపులు నిర్వహిస్తే చెప్పండి

వంగర: గ్రామాల్లో మద్యం బెల్టుషాపులు నిర్వహిస్తే సమాచారం ఇవ్వాలని ఎస్‌ఐ షేక్ శంకర్ అన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సచివాలయాలకు చెందిన మహిళా పోలీసులతో మంగళవారం ఆయన సమావేశమై, పలు సూచనలు చేశారు. గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు, బాల్యవివాహాల నిర్మూలనకు పాటుపడాలని తెలిపారు. అలాగే గ్రామీణులు సైబర్ మోసాల బారినపడకుండా అవగాహన కల్పించాలన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

రామభద్రపురం: ప్రస్తుత రోజుల్లో సైబర్ మోసాలు ఎక్కువగా జరుగుతున్నందున అందరూ అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీ శ్రీనివాసరావు సూచించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌ను మంగళవారం సందర్శించిన ఆయన అక్కడి రికార్డులు, కేసుల దర్యాప్తులో పురోగతి వంటి అంశాలను పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడిన ఆయన.. వాహనాలు నడిపే వారు కుటుంబం గురించి ఆలోచిస్తూ బాధ్యతగా నడపాలని తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించడం, మద్యం సేవించి వాహనాలు నడపడం వల్లే రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నియమాలు పాటించి, రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలన్నారు.

విద్యార్థులకు ఆరోగ్య తనిఖీలు

రేగిడి: మండలంలోని ఉంగరాడమెట్ట వద్ద ఉన్న సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలోని విద్యార్థులకు మంగళవారం ఆరోగ్య తనిఖీలు చేశారు. రేగిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సీహెచ్ అసిరినాయుడు ప్రతీ విద్యార్థి ఆరోగ్యం తనిఖీ చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం మంచి ఆహారపు అలవాట్లు, పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని, ఆరుబయట చిరుతిళ్లు తినవద్దని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, హెల్త్ అసిస్టెంట్ తాడేల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రాజాం సిటీ: మున్సిపాలిటీ పరిధిలోని బుచ్చెంపేటలో సెయింట్ ఆన్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం మంగళవారం నిర్వహించారు. 93 మంది రోగులకు ఆరోగ్య తనిఖీలు చేసి, ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి ప్రదీప్, సిస్టర్ రెజీ తదితరులు పాల్గొన్నారు.

విద్యాప్రమాణాలు మెరుగుపరచాలి

రేగిడి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాప్రమాణాలు మెరుగుపరచాలని ఎంఈవో బి.ఎరకయ్య సూచించారు. మండలంలోని ఆమదాలవలస, రేగిడి గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలను ఆయన మంగళవారం సందర్శించి, విద్యార్థులకు నాణ్యమైన విద్య, భోజనం అందించాలని తెలిపారు. విద్యార్థులు మధ్యాహ్న భోజనం చేసేటప్పుడు ఉపాధ్యాయులు పర్యవేక్షించాలన్నారు.